తిరుచ్చిపై సుందరరాజ స్వామి విహారం



తిరుచానూరు(చంద్రగిరి): పద్మావతి అమ్మవారి ఆలయంలో కొలువైన సుందరరాజ స్వామి గురువారం తిరుచ్చిపై కొలువుదీరి నాలుగు మాడవీధుల్లో విహరించారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్ర పురస్కరించుకుని వేకువజామున సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజ స్వామివారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సూపరింటెండెంట్ మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, జయకుమార్, భాస్కర్ నాయుడు, వీఐ రామ్మోహన్ పాల్గొన్నారు.

నంది వాహనంపై అర్ధనారీశ్వరుడు



చంద్రగిరి: తొండవాడ సమీపంలోని అగస్త్యేశ్వర స్వామివారి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లు గురువారం రాత్రి నంది వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. ఉదయం 7 గంటలకు బిల్వార్చన, 8 గంటలకు దక్షిణామూర్తికి అభిషేకాలు చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్లు నంది వాహనంపై ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ పనుల పరిశీలన



గంగమ్మ గర్భాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన, ఎంపీ గురుమూర్తి

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయం పునర్నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి పరిశీలించారు. వారు ముందుగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం గర్భాలయ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. రాబోయే అమ్మవారి జాతర నాటికి గర్భాలయ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. మహా కుంభాభిషేకం చేసి గంగజాతర వైభవంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, కార్పొరేటర్లు మునిరామిరెడ్డి, పొన్నాల చంద్ర, ఆలయ కమిటీ సభ్యురాలు ఎస్.భారతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పాకాలలో పెళ్లి కానుకను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చంద్రగిరిలో ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పాకాల/చంద్రగిరి : పాకాల మండలం దామలచెరువు పంచాయతీ కుక్కలపల్లికి చెందిన వధూవరులు సుబ్రమణ్యం, అముద, చంద్రగిరి మండలం అగరాల పంచాయతీ బండకాడపల్లికి చెందిన గుణశేఖర్, ప్రియాంక, ఏ.రంగంపేట పంచాయతీకి చెందిన భువనేశ్వరిరెడ్డి, వినోద్ కుమార్‌కు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి నూతన వధూవరులు కృతజ్ఞతలు తెలిపారు.

ఊరేగింపుగా నామినేషన్‌కు బయలుదేరిన సిపాయి

తిరుపతి మంగళం : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిపాయి సుబ్రమణ్యం గురువారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తితో కలిసి చిత్తూరులో నామినేషన్ దాఖలు చేసేందుకు తిరుపతి 50వ డివిజన్ తిమ్మినాయుడు పాళెం నుంచి భారీ ఊరేగింపుగా బయలుదేరారు. ఆయనకు దారి పొడవునా స్థానిక ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు పూల వర్షం కురిపించారు.

అమ్మవారి సేవలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్

తిరుచానూరు(చంద్రగిరి): పద్మావతి అమ్మవారిని గురువారం రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి డిప్యూటీ ఈఓ లోకనాథం, సూపరింటెండెంట్ మధు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలతో సత్కరించారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

పాకాల: స్థానిక ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలల్లో గురువారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాళ్లు బేబీశ్వర్‌రెడ్డి, రెడ్డిరామరాజు, చంద్రమ్మ, మొహిద్దీన్‌బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి తుడా: తిరుపతి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఎన్నికల అధికారి అనుపమ అంజలి తెలిపారు. ఆమె గురువారం పద్మావతి డిగ్రీ కళాశాల, పీజీ హాస్టల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటర్లకు 25, టీచర్లకు 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఎన్నికల నిర్వహణకు తగినన్ని బ్యాలెట్ బాక్సులు ఉన్నాయని వెల్లడించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళేశ్వర్ రెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ జీవన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూమనకు సత్కారం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న అజయ్‌కుమార్



ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నల్లాని బాబు, ఎస్.కె. బాబు

తిరుపతి మంగళం : తమ నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే భూమన కుటుంబానికి రుణపడి ఉంటామని వైఎస్సార్ సీపీ జిల్లా యూత్‌వింగ్ అధ్యక్షుడు ఎ.అజయ్‌కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైడి శివప్రసాద్‌యాదవ్ తెలిపారు. వారు గురువారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె.బాబు, కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు, నాయకులు తాలూరి ప్రసాద్, రావూరి ప్రసాద్, హరినాథ్‌రెడ్డి, శీను, నాగరాజు పాల్గొన్నారు.

గురువులే మార్గదర్శకులు



మాట్లాడుతున్న టీటీడీ చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేషశైలేంద్ర

తిరుపతి అలిపిరి: విద్యార్థులకు గురువులే మార్గదర్శకులని టీటీడీ చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేషశైలేంద్ర తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం 2022- 23 విద్యాసంవత్సరానికి స్టూడెంట్ కౌన్సిల్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మనలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి, లోపాలు సరిదిద్ది సమాజానికి పరిచయం చేసేవారు గురువులన్నారు. అధ్యాపకులు చెప్పిన విషయాలను చక్కగా విని జీవితాన్ని సరిదిద్దుకోవాలని కోరారు. భగవద్గీత ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. టీటీడీ డీఈవో ఎం.భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మహదేవమ్మ మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణతో నడుచుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ఆన్‌లైన్ అడ్మిషన్ల ద్వారా 606 మంది విద్యార్థినులు ప్రవేశం పొందారని తెలిపారు. స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌చార్జి భువనేశ్వరిదేవి, విశ్రాంత తెలుగు విభాగాధిపతి ప్రేమావతి, ఐఏసీ కో-ఆర్డినేటర్ ఉమారాణి, వార్డెన్ విద్యుల్లత పాల్గొన్నారు.

మిరప పంటలో అధిక దిగుబడికి చర్యలు

పాకాల : మిరప పంటలో అధిక దిగుబడి సాధించేందుకు చర్యలు చేపట్టాలని ఉద్యాన అధికారి ఎస్.శైలజ తెలిపారు. ఆమె గురువారం గోర్పాడు, ఉప్పరపల్లి, పాకాల పంచాయతీల్లోని మిరప పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు పెరుగుతున్న కారణంగా పంటలను రసం పీల్చే తామర పురుగులు ఆశిస్తున్నాయని తెలిపారు. దీంతో మిరప పంటలో ఆకులు పైకి ముడుచుకుని చిన్నవిగా మారుతాయని, మొక్క పెరుగుదల కూడా నిలిచిపోతుందని పేర్కొన్నారు. నివారణకు మిరప పంటలో ఎకరాకు 50 నీలిరంగు జిగురు అట్టలు పెట్టాలని, పొలము చుట్టూ పంట నాటే వారం రోజులు ముందు జొన్న, మొక్కజొన్న పంటలను కంచె పంటలుగా వేసుకోవాలన్నారు. సాళ్లలో వేప పిండి, కానుగ పిండి తప్పనిసరిగా వేసుకోవాలని తామర పురుగు నివారణకు వేపనూనెను 3 మిల్లీలు, డిటర్జెంట్ పౌడర్-5 గ్రాములు, థయోమిథాక్సామ్ 0.5 గ్రాములు, మాంకోజెబ్ 2.5 గ్రాములు, జిగురు గమ్ 0.5 మిల్లీలను లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో ఒక సారి పిచికారీ చేయాలని సూచించారు. మందు పిచికారీ చేసిన 5వ రోజు ఫార్ములా 4-లీటరు నీటికి 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. తద్వారా కొత్త చిగుర్లు వస్తాయని తెలిపారు.

ఏడుగురికి రిమాండ్

తిరుపతి లీగల్ : అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి 12 ఎర్రచందనం దుంగలను నరికి తరలిస్తున్న కేసులో ఏడుగురికి మార్చి 7 వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత గురువారం ఆదేశాలు జారీ చేశారు. పుత్తూరు ఎంఎస్‌ఎన్ నగర్‌కు చెందిన డి.సుబ్రమణ్యం, నగరికి చెందిన ఎస్.పళణివేలు, ఎంజి శేఖర్, గూడూరు మండలం నేలత్తూరుకు చెందిన జి.కృష్ణయ్య, ఎం.మనోహర్, గూడూరు రూరల్ మండలం దేవిపాళ్యంకు చెందిన ఎస్.ప్రసాద్, వరదయ్యపాళ్యంకు చెందిన ఎస్.రవిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

తిరుపతి అలిపిరి: చెన్నైలోని జీఏ చెట్టి రోడ్డులో నిర్మిస్తున్న శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో గురువారం ధ్వజస్తంభాన్ని టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. జేఈవో వీరబ్రహ్మం, చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్ పాల్గొన్నారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజస్తంభానికి రక్షాబంధనం, కళావాహనం చేసి నవధాన్యాలు, నవరత్నాలు, నవలోహాలతో ప్రతిష్టించారు. కూర్మ, కుబేర, మహాలక్ష్మి యంత్రస్థాపన చేశారు. టీటీడీ సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ సత్యనారాయణ, డెప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, సుబ్రమణ్యం, వీజీవో మనోహర్, ఈఈ మనోహర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం

భాకరాపేట : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో దేవేంద్రబాబు తెలిపారు. ఆయన గురువారం మండల అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఏప్రిల్ 7న తిరుపతిలో జీ 1117 చిత్ర షూటింగ్



మాట్లాడుతున్న దర్శకుడు మర్రి గిరిరెడ్డి

తిరుపతి కల్చరల్: ఇండియన్ ఫిలిం ఫ్యాషన్ మీడియా నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ ఫిలిం ప్రొడక్షన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న జీ 1117 చిత్రం షూటింగ్‌ను ఏప్రిల్ 7వ తేదీన తిరుపతిలో ప్రారంభించనున్నట్లు నిర్మాత, దర్శకుడు మర్రి గిరిరెడ్డి తెలిపారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తమ సంస్థ నుంచి జీ 1117 చిత్రంతో పాటు ప్రొడక్షన్ నెంబర్-1, ఇలవరసీ అనే మూడు సినిమాలను రూపొందించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తొలి చిత్రం షూటింగ్‌ను తిరుపతిలో ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సరికొత్త లవ్ స్టోరీతో రూపొందుతున్న ఈ చిత్రంలో తనతో పాటు రాజశేఖర్, సారిక అవసారి ముఖ్య పాత్రలు పోషించనున్నట్లు పేర్కొన్నారు. చిత్రం నటి సారిక అవసారి పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

చంద్రగిరి: రాయలపురం పంచాయతీ వెంకటంపేటలో గురువారం బాలికపై యువకుడు లైంగిక దాడికి యత్నించాడు. పోలీసుల కథనం మేరకు.. రాజస్తాన్‌కు చెందిన కార్మికులు గుడారాలు వేసుకుని తిరుపతి, చంద్రగిరి పరిసర ప్రాంతాల్లో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటున్నారు. వారి పిల్లలు సుమారు 40 మందిని అధికారులు వెంకటంపేటలోని పాఠశాలలో చేర్పించారు. కుప్పానికి చెందిన సురేష్ కంకణం ధరించేందుకు మూలస్థాన ఎల్లమ్మ ఆలయం వద్దకు వచ్చాడు. పాఠశాలకు వెళ్తున్న బాలికను గోడ పక్కకు తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని నిందితుడిని పోలీసులకు అప్పగించారు.

కోతిగుండుకు ఆకతాయిల నిప్పు



చంద్రగిరి: రాయలవారి కోట సమీపంలోని కోతిగుండుకు కొంతమంది ఆకతాయిలు గురువారం నిప్పంటించారు. గాలి ఎక్కువగా వీయడంతో మంటలు రాయలవారికోట వైపు వ్యాపిస్తున్నాయి. అధికారులు అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అడవికి నిప్పు పెడితే చర్యలు తప్పవు

అడవికి నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవని ఏ.రంగంపేట అటవీ అధికారి చక్రపాణి హెచ్చరించారు. ఆయన గురువారం సాయంత్రం చిన్నరామాపురం గ్రామస్తులు, పశుకాపర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అడవులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల ఎన్నో జీవరాశులు మృతిచెందుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించి అటవీ సంపదను కాపాడుకోవాలని సూచించారు. ఎఫ్‌బీవో రవి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

చంద్రగిరి: దోమల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పీలేరుకు చెందిన మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్ తెలిపారు. ఆయన గురువారం కొటాల పీహెచ్‌సీ పరిధిలోని హాస్టళ్లను పరిశీలించారు. అగరాల సమీపంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, హాస్టల్, వంటగది, పాఠశాల పరిసరాల్లో మలాథిన్ మందును పిచికారీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ గీతాంజలి, సిబ్బంది హిమబిందు, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



చంద్రగిరి: మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి గురువారం చంద్రగిరికి చెందిన ఉపాధ్యాయుడు వెంకట్ రెడ్డి రూ.55,555, చిమ్మీబాయ్ సుధాకర్ నాయుడు రూ.50,116 విరాళం ఇచ్చారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి నగదు అందజేశారు. వారికి అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

భాకరాపేట : ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. ఆయన గురువారం సీఆర్పీలు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తోందన్నారు. నాణ్యమైన బోధన కోసం శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించిందన్నారు. ఈ విషయాలను తల్లిదండ్రులకు తెలిపి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పేలా చూడాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

చంద్రగిరి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చంద్రగిరి సీఐ ఓబులేశు తెలిపారు. ఇటీవల పూతలపట్టు-నాయుడుపేట రోడ్డులో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండడంతో భద్రత చర్యలు చేపట్టారు. ఆయన గురువారం ఎంవీఐ శ్రీనివాసరావుతో కలిసి పనపాకం సమీపంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పరిశీలించారు. వాహనాల వేగాన్ని తగ్గించేందుకు రోడ్డుకు రెండు వైపులా ఇసుక డ్రమ్ములు ఏర్పాటు చేయించారు.

న్యాయమూర్తికి సన్మానం



తిరుపతి లీగల్: తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ భీమునిపట్నంకు బదిలీ అయిన సీహెచ్ పవన్‌కుమార్‌ను గురువారం స్థానిక ప్రిన్సిపల్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ శ్రీనివాసులునాయక్, కోర్టు సిబ్బంది హేమకుమార్, కవిత పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు యశ్వంత్



తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు తిరుపతిలోని విశ్వం పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎం.యశ్వంత్ ఎంపికైనట్లు విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి తెలిపారు. వారు గురువారం విద్యార్థిని అభినందించారు. విశాఖపట్నంలో ఈ నెల 20నుంచి 22వ తేదీ వరకు 66వ ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థి ఎం.యశ్వంత్ ప్రతిభ చూపి 3 బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు.

చురుగ్గా బలిజ భవన్ పనులు

తిరుపతి కల్చరల్: నరసింహ తీర్థం రోడ్డులో బలిజ భవన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బలిజ జేఏసీ అధ్యక్షుడు నీలం బాలాజీ, కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బలిజభవన్‌ను పరిరక్షించాలని తాము చేసిన విజ్ఞప్తితో ఎమ్మెల్యే భూమన స్పందించి పనులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గోపి రాయల్, గుట్ట నాగరాజ రాయల్, శ్రీరామ్ గోపి పాల్గొన్నారు.

అర్చక దంపతుల కోసం పోలీసుల గాలింపు

తిరుచానూరు(చంద్రగిరి): చిట్టీల పేరుతో మోసం చేసి పరారీలో ఉన్న అర్చక దంపతుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. చిట్టీలు వేసుకుని డబ్బులు చెల్లించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన నితిన్‌సింగ్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు తిరుచానూరు ఆలయంలో అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్ బాబు, ఆయన భార్య పద్మశ్రీవాణిపై కేసు నమోదు చేశారు. నాలుగు రోజులుగా ఇంటికి తాళాలు వేసి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందం రంగంలోకి దిగినట్లు తెలిసింది.

గాయనికి పోలీసుల నోటీసులు దారుణం

తిరుపతి కల్చరల్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో ప్రముఖ జానపద గాయని నేహాసింగ్ రాథోర్‌కు పోలీసులు నోటీసు ఇవ్వడం దారుణమని ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 17 నుంచి 19వ వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయ సదస్సు, సాంస్కృతిక ఉత్సవాల్లో నేహాసింగ్ వెళ్లకుండా అడ్డుకునే చర్యల్లో భాగంగానే నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసును వెనక్కి తీసుకోవాలని, లేకుంటే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.